క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణ చేశారు. క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యం లో పూజలు జరిగాయి.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఊటగెడ్డ నుంచి ఎన్టీపీసీ రోడ్డులో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా ఊటగెడ్డ కూడలి, ఠాగూర్ లేఅవుట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు గమనించాలని ఈఈ రామకృష్ణ కోరారు.

పెందుర్తి: వేపగుంట సమీపంలోని బంటా కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. రవినగర్, అప్పలనర్సయ్యకాలనీ, బంటాకాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పథకాలను వివరిస్తున్న కళాకారులు

పెందుర్తి: ఆర్థిక అక్షరాస్యతతో ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమవుతుందని మండలంలోని రాంపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) శాఖ బ్రాంచి మేనేజర్ గంగాధర్ అన్నారు. నాబార్డు సౌజన్యంతో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎం గంగాధర్ మాట్లాడుతూ ఎస్‌బీఐ ద్వారా వినియోగదారులకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం విశ్వకర్మ కేసీసీ రుణాల గురించి చెప్పారు. కళాకారులు తమ ప్రదర్శన ద్వారా పథకాల గురించి వివరించారు. ఎస్‌బీఐ ప్రతినిధులు శ్రవంతి, వరలక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అతివలదే అగ్రస్థానం

పెందుర్తి ఓటర్లు
2,99,103 మంది
మహిళలు
1,50,522
పురుషులు
1,48,576



పెందుర్తి: నియోజకవర్గంలో మహిళా ఓటర్లదే అగ్రస్థానం. వారే నిర్ణేతలు కానున్నారు. పెందుర్తి నియోజకవర్గంలో మొత్తం 2,99,103 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 1,50,522, పురుషులు 1,48,576, ఇతరులు ఐదుగురు ఉన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ కలెక్టర్, ఈఆర్వో శేషశైలజ రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన తుది ఓటరు జాబితాను తొమ్మిది ప్రధాన పక్షాలకు అందించామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటరు జాబితాలను ప్రదర్శనకు ఉంచామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫైనల్ ఓటరు జాబితా ప్రకటించడం జరిగిందన్నారు. వీటిని నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచేలా సచివాలయ సిబ్బందికి తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఓటర్లు అంతా తమ ఓటు హక్కు ఉందో, లేదో అనే విషయాన్ని జాబితాల్లో పరిశీలన చేసుకునేందుకు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఈఆర్‌వో శేషశైలజ

వీలుగా జాబితాలను ప్రదర్శనకు ఉంచాలన్నారు. అందరికీ ఈ విషయం తెలిసేలా మండల స్థాయి ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు వినియోగంపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించేలా అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాలన్నా, సకాలంలో ఉన్నతాధికారులకు అందజేసేలా అధికారులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితా పరిశీలన అనంతరం ఎలాంటి సందేహాలు ఉన్నా, రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎన్నికల విభాగం డీటీ అర్జునరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు



లంకెలపాలెం కాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం పరిసర కాలనీలు, దేశపాత్రునిపాలెం పరిసర గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.కోటిన్నరతో లంకెలపాలెం ఆర్‌కే టౌన్‌షిప్, విరోతి దొడ్డి, గెంజిపేట, బీసీ కాలనీ, కర్రివీధి, దేశపాత్రునిపాలెం శేషాద్రినగర్, సాయినగర్ కాలనీ, ఎస్‌డబ్ల్యూకే కాలనీతో పాటు పోలమాంబ ఆలయం సమీపంలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు ఈ నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. నిర్మాణ పనులు తక్షణం ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ), పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, నాయకులు కాసు అంజిరెడ్డి, సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు



విధుల్లో చేరిన పత్రాలు చూపుతున్న అంగన్‌వాడీలు

పరవాడ: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో 42 రోజులుగా సమ్మె చేస్తున్న వారు మంగళవారం విధుల్లో చేరారు. ప్రభుత్వ హామీతో సమ్మె విరమించి నుంచి విధుల్లో చేరుతున్నట్లు అంగీకార పత్రాలను అధికారులకు అందజేశారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ చెప్పారు. చెప్పారు. అంగన్‌వాడీల సమ్మెకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నేతలకు, కార్మిక సంఘాలకు, ప్రజలకు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమణి, సీహెచ్.దేవి ధన్యవాదాలు తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ముత్యాలమ్మపాలెంలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మహిళలు, నాయకులు

పరవాడ: కుల, మత వర్గ భేదం లేకుండా పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన అందరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ముత్యాలమ్మపాలెం సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాల అక్కచెల్లమ్మలకు 4వ విడతగా మంగళవారం వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల చేసిన కార్యక్రమాన్ని ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలు, నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా అచ్చిబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను 4 విడతలుగా చెల్లించడం అభినందనీయమన్నారు. దీని వల్ల అధిక వడ్డీలకు మహిళలు రుణాలు తీసుకోవాల్సిన బెడద తప్పిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని అచ్చిబాబు కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, సీసీ రాము, నాయకులు అరిజిల్లి మసేను, సూరాడ చినమసేను, అరిజిల్లి చంటి, డ్వాక్రా సంఘాల సీఏ సత్యవతి, ఎం.రాజులమ్మ, ఎస్.రాజేశ్వరి, సీహెచ్.చంద్ర పాల్గొన్నారు.

ఐజీబీసీ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



స్టూడెంట్ చాప్టర్ ప్రారంభిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) స్టూడెంట్ చాప్టర్‌ని మంగళవారం ప్రారంభించారు. ఆరో హరిత్ ప్రేమ్ భారత్ మహోత్సవ్ 2024లో భాగంగా 369వ విద్యార్థి శాఖను ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేశారు. గ్రీన్ బిల్డింగ్‌లపై యువతకు అవగాహన కల్పిస్తూ, వీటికి సంబంధించిన సమాచారాన్ని ఈ శాఖ అందిస్తుంది. ఐజీబీసీ విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం చైర్మన్ లీలా ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ.. స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ధ్రువ పత్రాలను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.ఆర్.కె.సత్యనారాయణరెడ్డి, ఐజీబీసీ సీనియర్ కౌన్సెలర్ శ్రీరేఖ, తదితరులు పాల్గొన్నారు.

క్షయ ప్రాణాంతకం కాదు

- సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం
- పీహెచ్‌సీ వైద్యాధికారి కనక అప్పారావు



పరవాడ: క్షయ (టీబీ) ప్రాణాంతక వ్యాధి కాదని.. నివారణ మార్గాలు ఉన్నాయని వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వి.కనక అప్పారావు చెప్పారు. టీబీ లక్షణాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు దగ్గు, సాయంత్రం పూట జ్వరం వస్తే క్షయ వ్యాధి లక్షణాల్లో ఒకటని చెప్పారు. క్షయ వ్యాధి సోకిన వారు బరువు తగ్గడం, ఆకలి మందగించడం, నీరసం అధికంగా ఉండడం, పని మీద ఆసక్తి లేకపోవడం, ఛాతిలో నొప్పి, రాత్రి సమయంలో చమటలు పట్టడం, నడిచిన, పనిచేసినా ఆయాసం అధికంగా రావడం, వారం పైబడి దగ్గు, రక్తంతో కూడిన కళ్లె పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి నివారణ మార్గాలు తెలుసుకోవాలన్నారు. దగ్గు ద్వారా వచ్చే కళ్లెని ఒక కప్పులో పట్టి ఆరోగ్య కార్యకర్తలకు అందజేస్తే దానిని వైద్య పరీక్షలకు పంపి టీబీ లక్షణాలను గుర్తిస్తారన్నారు. ఒక వేళ టీబీ క్రిములు ఉన్నట్లు గుర్తిస్తే అందుకు తగిన మందులు ఉచితంగా అందజేస్తారని వాటిని వినియోగించడం ద్వారా క్షయ వ్యాధిని నివారించవచ్చునని చెప్పారు. శరీరంలోని ఊపిరితిత్తులు, ఎముకలు, పెద్ద ప్రేగులు, వెన్నెముకకు క్షయ వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఊపిరితిత్తులకు క్షయ వ్యాధి సోకితే ఆరు నెలల పాటు మందులు వాడాలన్నారు. మిగిలిన భాగాలకు సోకితే ఏడాది పాటు మందులు వాడడం ద్వారా వ్యాధిని నివారించవచ్చునని తెలిపారు. మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభ్యమవుతాయన్నారు. ఈ అవకాశాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు కోరారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై కొరడా



గంగవరంలో గ్రావెల్ తవ్వుతూ పట్టుబడిన పొక్లెయిన్



విచారణ చేపడుతున్న మైనింగ్ అధికారులు

రూ.30 వేలు ఫైన్ వేసిన మైనింగ్ అధికారులు

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు పరిధి గంగవరం గ్రామంలో జగనన్న కాలనీని ఆనుకుని ఉన్న లే అవుట్‌లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న వారిపై మంగళవారం మైనింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయిన్‌ను పట్టుకుని మైనింగ్ లాయిల్టీ అధికారి స్వాతి రూ.30 వేల అపరాధ రుసుం విధించారు.

వివరాలు.. గంగవరం గ్రామంలో ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అర్బన్ హౌసింగ్ లే అవుట్ వేసి గృహ నిర్మాణాలు చేపడుతోంది. దీంతో గ్రామంలో రైతుల నుంచి సేకరించిన భూములతో పాటు లే అవుట్‌లో గృహ నిర్మాణాలు,రోడ్లు అభివృద్ధి చేసేందుకు అవసరమైన గ్రావెల్‌ను తరలించేందుకు అధికారులు కొంత ఉదారంగా వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకుని ఈ ప్రాంతంలోని కొంత మంది అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. లే అవుట్‌ల అభివృద్ధి ముసుగులో అధికారులకు తెలియకుండా గాజువాక వంటి ప్రాంతాలకు గ్రావెల్ తరలిస్తూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారు. గంగవరం గ్రామానికి చెందిన జనపరెడ్డి రామునాయుడు అనే వ్యక్తి నుంచి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌లో భూమి సేకరించింది. ఆయనకు రీ కన్‌స్ట్రక్టడ్ ప్లాట్‌లలో భాగంగా కొంత భూమి ఇచ్చింది. సదరు భూమిని చదును చేసే పేరిట కొన్ని రోజులుగా విలువైన గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారని మైనింగ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో మైనింగ్,రెవెన్యూ సిబ్బంది మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దీంతో రామునాయుడు అధికారులపై చిందులు వేశారు. మైనింగ్ లాయిల్టీ అధికారి స్వాతి, వీఆర్వో వెంకటేష్ పరిశీలించి అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తుండడంతో రామునాయుడుపై కేసు నమోదు చేసి రూ.30 వేలు ఫైన్ విధించారు.

గెడ్డలో పూడిక తొలగింపు



గెడ్డలో పూడిక తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలోని గెడ్డలో మంగళవారం పూడిక తొలగించారు. ఆ వార్డు వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ ఈ పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ అధికారుల సహకారంతో పొక్లెయిన్‌తో పూడిక తొలగింపు పనులు చేపట్టామన్నారు.

యువతకు ఉపాధి కల్పనపై దృష్టి



మాట్లాడుతున్న రామునాయుడు

సబ్బవరం: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ శాశ్వతమైనవని, వాటిని ఎవరూ తొలగించలేరని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రాము నాయుడు అన్నారు. మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఉప సర్పంచ్ మంగునాయుడు అధ్యక్షతన జరిగిన సభలో రామునాయుడు మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోకుండా ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే లక్ష్యంతో వికసిత భారత సంకల్ప యాత్రలు చేపట్టి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులందరికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు నెలకొల్పి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బీసీ మోర్చా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కంచిపాటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు బోధించే నాయకత్వం అవసరం



గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: నైతిక విలువలు బోధించే నాయకత్వం కోసం యువత ఎదురుచూస్తోందని ఏయూ న్యాయ కళాశాల పూర్వ ఆచార్యుడు, డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గాంధీజీ–జాతీయ సమైక్యత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ పౌరుడు బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథి విజయ విహారం రమణమూర్తి మాట్లాడుతూ సంఘర్షణలు పరిష్కరించడానికి గాంధీజీ ఆలోచనలు ఉపకరించే విధానాలు వివరించారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యామ్ ప్రసాద్, విశాఖ స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పి.కిషోర్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’తో క్రీడాకారులు వెలుగులోకి

- ఎంపీపీ బోకం సూర్యకుమారి
- మండల స్థాయి విజేతలకు క్రీడా కిట్‌ల అందజేత



నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కిట్‌లు అందజేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ప్రతిభ ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వచ్చారని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడా జట్లకు ఆమె కిట్‌లు అందజేశారు. అక్కడ కూడా చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఏవో ఎస్ బాబూరావు,డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపీటీసీ బైలపూడి దేముడు, పీడీ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్త్రీల విభాగంలో క్రీడా పోటీల విజేతలు

బ్యాడ్మింటన్ (సబ్బవరం–1 జట్టు) కబడ్డీ (పైడివాడ అగ్రహారం), వాలీబాల్(పైడివాడ అగ్రహారం), ఖోఖో (మొగలిపురం), క్రికెట్(ఆరిపాక) జట్లు విజేతలుగా నిలిచాయి.

పురుషుల విభాగంలో విజేతలు..

బ్యాడ్మింటన్ (గుల్లేపల్లి), కబడ్డీ(వంగలి), వాలీబాల్ (అంతకాపల్లి) ,ఖోఖో(తవ్వవానిపాలెం), క్రికెట్ (బోదువలస) జట్లు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి ముఖద్వారం వద్ద మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ఎనిమిది నెలలుగా ఏ నెలా సమయానికి జీతాలు చెల్లించలేదన్నారు. డిసెంబర్ నెల జీతం ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ జీతాలు ఎగ్గొట్టడంతో యాజమాన్యం రెండు, మూడు నెలలకు ఒకసారి జీతాలు చెల్లిస్తోందని చెప్పా రు. తక్షణమే జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం విభాగం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అన్యాయం



ఉక్కుదీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దీనిపై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1076వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎస్ఎంఎస్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం పోరాడుతున్నా ప్రధాని నరేంద్రమోదీ ఈ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు.